తిరిగి బ్రాహ్మలనే ఉద్ధరింపవలసిన అవసరం వస్తుందన్నా అతిశయోక్తి కాదు.

హరిజనులను ఉద్ధరించాలి. నిజమే. కాని వారి సాంఘిక లక్షణాలూ, తక్కువగానున్న వారి నాగరిక ప్రమాణం, చదువుసంధ్యల ప్రమాణం, మొదలైనవి పెంచాలి. ముందు తరవాత వారిని 'దూరం' 'దూరం' అంటూ ఏ బ్రాహ్మలూ తోసివెయ్యరు. ఇది చేయకుండా మీమధ్య వారిని వుండనివ్వండి అని ప్రభుత్వం నిర్బంధిస్తే వద్దనరు కాని, వారే అక్కడినుంచి తప్పుకోవచ్చు. దానిని ప్రభుత్వం కాదనలేదు కదా?

హరిజనులపట్ల యింత విశాల హృదయం ప్రదర్శించే మద్రాసు ప్రభుత్వం త్యాగరాయ నగరులో ఒక స్థలంనుంచి, ఒకటి రెండూ కాదు పన్నెండు వందల కుటుంబాలని "యిల్లు" ఖాళీ చేయిస్తూంది. యీ "యిళ్ళకి"కి లైసెన్సు లేకపోవడం, అంటే యీ గుడిసెలు వేసుకుందుకు ప్రభుత్వం పెర్మిషన్ యివ్వలేదన్న మాట.

ఈ కుటుంబాల్లో ఆరు వందలు మటుకు మొదటి నుంచీ వుంటున్నవారట. వీరిని మాత్రం వుండనిచ్చి మిగతావారిని ఖాళీ చేయించాలని తీర్మానించారు. కాని, ఉంటే వుంటాం లేకుంటే అందరం వెళ్ళిపోతాం అన్నారు యీ కుటుంబాలవారు. ఒక్కొక్క గుడిసెలో రెండు మూడు కుటుంబాలు వుంటున్నాయట. ఆ చుట్టుపక్కల వాతావరణం అతి దారుణంగావుండి అనారోగ్యానికి పుట్టినిల్లు అవుతుందన్న సదుద్దేశంలో ప్రభుత్వం అక్కడి జనాభా ఒత్తిడిని తగ్గించాలని చూసింది. కాని ఉంటే అంతా లేకుంటే లేదు అన్నారు వారు. ఇదీవరస. యింకా నయం, అలా పొమ్మన్నందుకు సత్యాగ్రహం చేస్తాం అనలేదు. తీరా చేసి బాబూజీ ప్రియబాంధవులయిన హరిజనులు సత్యాగ్రహం చేస్తే కాంగ్రెసు ప్రభుత్వం కాళ్ళూ చేతులూ కట్టేసినట్లే కదా? —(రుద్రాణి)

---

స్కెచ్

# ఫీజువారి ఉపకారం

వేదుల కామేశ్వరరావు

బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంటూ పది గంటలు కొట్టింది ఆఫీసు గోడగడియారం. పొద్దున్నే చల్దికూడు తినివచ్చిన భద్రయ్య ఆవులించి చిటికే శాడు, కూర్చొన్న చోటునే కునికిపాట్లతో సతమతమవుతూ. అప్పుడే ఏదో మించిపోతున్నట్టు సూర్యుడు వేడెక్కిపోతున్నాడు. ఆఫీసు జవాను అబద్ధం కంగారుగా డొక్కుసైకిలు దిగి కాళ్లు చీడీల నేసి గట్టిగా కొడుతూ వచ్చి, ఆఫీసు తాళాలు తీశాడు. భద్రయ్య లేచి నిలబడి నమస్కారం చేశాడు. అబద్ధం అతన్ని చూడనట్టు నటించి లోపల కెళ్ళిపోయాడు. భద్రయ్య గుమ్మంలో నిలబడి, 'బాబుగారూ, ఓసారిలా వస్తారా?' అన్నాడు.

"ఎవరోయ్ నువ్వు? ఇప్పుడు ఖాళీ లేదు పో."

"అదికాదు బాబూ!"

"అదికాకపోతే ఇంకేమిటి?... వెళ్లు!"

"అదికాదు బాబయ్యా!"

"అరే, మళ్ళీ అదే అంటున్నావ్!" అంటూ అబద్ధం బయటికొచ్చాడు. 'తమరే అలాగంటే ఎలా చెప్పండి? సర్టిఫికేటుకోసం నాలుగురోజుల బట్టి తిరుగుతు'న్నాను బాబూ!" అంటూ ఐదురూపాయల కాగితాన్ని అతడి జేబులో పెట్టాడు భద్రయ్య. "సరేలే కూర్చో! గుమాస్తాగారూ, ఆఫీసరుగారూ వచ్చాక ఇస్తాను" అంటున్న అబద్ధం చీడీ లెక్కతున్న గుమాస్తాను చూసి, "అబ్బ! అలా కూర్చోవయ్యా, అప్పుడే తెల్లారింది నీకు!" అంటూ గదిమాడు. అర్థంకాని పిచ్చి భద్రయ్య వెర్రిచూపు చూస్తూ పక్కకు తప్పుకొన్నాడు.

గుమాస్తా చేతులలో ఫైల్సు తిరుగుతున్నాయి. అబద్ధం వచ్చి అక్కడ నిలబడ్డాడు. గుమాస్తా అతనికేసి చూసి ఓ చిరునవ్వు ప్రదర్శించాడు. అబద్ధం జేబులోంచి ఓ కాగితం తీసి ఆయన

దగ్గర పెట్టాడు. ఆయన అబద్ధంకేసి సుదీర్ఘంగా చూశాడు. అబద్ధం నవ్వాడు. గుమ్మంలోంచి తొంగిచూస్తున్న పిచ్చి భద్రయ్యకేం తెలుసు ఆ నవ్వుల్లో గల అంతరార్థాలు?

"దీనిమీద కొంచెం తొందరగా సంతకం పెట్టించండి" అన్నాడు అబద్ధం.

"సరేలే ఆదక్కడుంచి, వెళ్ళి ఒక స్వీట్స్ పొట్లం తీసుకురా! మా వాడీవేళ బిళ్ళలు కావాలంటూ ఏకగోల పెడుతున్నాడు" అంటూ గుమాస్తా కాగితాలలో పడ్డాడు. డబ్బులుకోసం చెయ్యి చాపాడు అబద్ధం పాపం!

"ఆఁ. వెళ్ళవోయ్! ఏమీ ఎరగనట్టు చెయ్యి జాపుతావేం? నాకంతా తెలుసులే." అన్న గుమాస్తా మాటలకు సిగ్గుపడి హడావుడిగా వెడుతూంటే ఆఫీసరుగారు ప్రవేశిస్తూ అబద్ధాన్ని నిలదీసి అడగ్గా, "గుమాస్తాగారికి స్వీట్సుకోసమండీ!" అని అతడు నిజంచెప్పి వెళ్ళిపోయాడు. గుమ్మంలో భద్రయ్యను చూస్తూ లోపలకెళ్ళాడు ఆఫీసరు.

ఆఫీసరు ఏమీఎరగనట్టు మెల్లగావెళ్ళి కుర్చీలో కూర్చొన్నాడు. గుమాస్తా పైల్సు తిరగేస్తున్నాడు. అబద్ధం స్వీట్స్ తెచ్చి గుమాస్తాముందు పెట్టి, "రూపాయీ బేడా అర్ధణా" అన్నాడు. గుమాస్తా సానుభూతిగా అతడివైపు చూసి కాగితం మీద సంతకం పెట్టాడు. ఆ కాగితంతో అబద్ధం ఆఫీసరు గారి గదిలో అడుగు పెట్టాడు.

ఆఫీసరు అప్పటికే ఏవో కాగితాలు చూస్తున్నాడు. అబద్ధం తన కాగితం అక్కడ పెట్టాడు. ఆఫీసరు అతడిని నిజంగానే చూడలేదు. అబద్ధం ఓ పావుగంట నిలబడి, బయిటకొచ్చేశాడు. భద్రయ్య ఆత్రుతగా లోపలికి చూస్తూనేవున్నాడు. గుమాస్తా గారి సలహా ప్రకారం, ధైర్యం తెచ్చుకొని అబద్ధం ఆఫీసరుగారి గదిలో కెళ్ళాడు.

"బాబుగారూ!"

"ఏం?"

"అబ్బే. ఏంలేదండి!"

"ఏమీ లేకపోతే ఎందుకూ?"

"అబ్బే ఆ కాగితం..."

"ఆ కాగితం అక్కడ పెట్టావుగా!"

"దానికోసం పాపం ముసలతను నాలుగు రోజులబట్టి తిరుగుతున్నాడండి. కొంచెం తొందరగా..." ఇంక చెప్పలేక పోయాడు అబద్ధం. సీరియస్‌గా వ్రాసుకొంటున్న ఆఫీసరు తలపైకెత్తి,

'వెంటనేవెళ్ళి ఒక సిగరెట్ టిన్ తీసుకురావోయ్' అన్నాడు. పరుగెడుతున్న అబద్ధాన్ని మళ్ళీ పిలచి "నే కాల్చే బ్రాండు నీకుతెలుసుగా?" అన్నాడు. ఇంకో వస్తువేదో తెమ్మంటాడేమోనని భయపడిన అబద్ధం ముందుకు మళ్ళీ కరుగెత్తాడు, "నాకు తెలుసునండి" అంటూ.

ఐదునిమిషాల్లో సిగరెట్ల టిన్నుతోసహా అబద్ధం పరుగెత్తుకు వచ్చాడు. ఆఫీసరు కాగితంమీద సంతకం పెట్టాడు. అబద్ధం దాన్ని తీస్తుంటే నవ్వుతూ అన్నాడు ఆఫీసరు, "ఇలాటి ముసలాళ్ళని రోజూ జాగ్రత్తగా కనిపెట్టాలి సుమా!" అని. తను కష్టపడి పరుగెత్తుకువెళ్ళి తెచ్చిన సిగరెట్టు టిన్ను బల్లమీద పెడుతూ "రెండురూపాయల పదమూడణాల ముక్కాణీ అండి" అని అనలేక పోయాడు అబద్ధం.

అబద్ధం కాగితం పుచ్చుకు బయటకొచ్చేటప్పటికి మందహాసం చేస్తూ అన్నాడు గుమాస్తా, "ఈవేళ ఎవరిముఖం చూశావోగాని, మంచి ముసలాడు దొరికేడోయ్" అని.

"ఈవేళ మనమందరం ఎవరి ముఖాలు చూశామో!" అందామనుకొని, ఎందుకేనా మంచిదని అనడం మానేసి తిన్నగా చీడీలమీద కూర్చొని కునికిపాట్లు పడుతున్న భద్రయ్యదగ్గరకు వెళ్ళాడు అబద్ధం. భద్రయ్య నిద్రపోతున్నాడు.

"భద్రయ్యగారూ! భద్రయ్యగారూ!" లేపాడు అబద్ధం. ప్రొద్దున్నెప్పుడో తిన్న చద్దికూడు పొట్టలో ఇంకా చప్పుడు చేస్తూ వుండగా, నిద్రపోతున్న భద్రయ్య లేచి కూర్చున్నాడు. ఈ నాలుగు రోజులబట్టీ అతడికి నిద్రపోవటం అలవాటయిపోయింది.

"ఇదిగో నీ సర్టిఫికేటు! ఆఫీసరుగారి సంతకమయిందిలే. నీ కాగితంకోసం పొద్దుట్నుంచీ తెగ వెతికామనుకో. ఎప్పుడైనా ఏదైనా కాగితం కావలస్తే వస్తూండవయ్యా, మరేం ఫరవాలేదులే!" అంటూన్న అబద్ధంవైపు జాలిగా చూస్తూ, అతడికి నమస్కరించాడు భద్రయ్య. ఇదంతా కలో, నిజమో, తెలియటంలేదు: పాపం భద్రయ్యకు, అప్పుడే నిద్దట్లోంచి లేవడంవల్ల. ★